# లేచిపోయిన మనిషి

"అమ్మా! ఉత్తరాలు ఎవరికేనా వ్రాయమంటావా?" అన్నాడు రమణమూర్తి. ప్రొద్దున్నుంచీ సుజాత జుట్టు విరబోసుకుని నేల మీద కూర్చుంది. ఒక్క మాట మాట్లాడదు. మెడమీది ఎముకలు బయటపడ్డాయి.

కళ్లక్రింద నల్ల మచ్చలు, ఎండి పోయిన ముఖం. అంత చక్కని మనిషి కూడా వికారంగా కనబడుతోంది. మెల్లిగా కళ్లు త్రిప్పి పెద్ద కొడుకు వంక చూసింది.

"ఎవరికేనా వుత్తరాలు వ్రాస్తే వ్రాయండన్నాడు బ్రాహ్మడు. నిత్యకర్మ ప్రారంభిస్తామని ఎవరికి వ్రాయమంటావు?" అన్నాడు రమణ.

లోపల నుంచి పొగలుగా గుబులుగా పైకి తెల్లి వచ్చి చప్పున పగిలింది ఆమె గుండె ఆపలేని ఏడుపు. ఏదో జంతువు దీనంగా ప్రాణం పోతోంటే చేసే దీనాలాపన, దిక్కులేని వాళ్ళు చేసే ఆర్తనాదం అలా తల్లి ఏడవగానే రమణకి పట్టరాని దు:ఖం వచ్చింది. "అమ్మా" అంటూ దగ్గరకు వెళ్ళి చేతులు పట్టుకుని కళ్లు తుడిచి, వీపు నిమరసాగాడు. "మనకి ఎవరూ లేరు నాయనా! ఉన్నవాళ్ళు రారు" అన్నది ఆమె అలాగే ఏడుస్తూ కొంత సేపటికి.

రమణ, కామేశ్వరావు రామలక్ష్మణుల్లాగా చేయెత్తు పురుషులైనారు. ఇద్దరూ చదువుకున్నారు. ఒకడు డాక్టరు. ఒకడు యింజనీరు ఉద్యోగాలు వచ్చాయి. మంచి మార్కులతో స్కాలర్‌షిప్పుల మీద చదువుకుంటూ పైకి వచ్చారు. అంత కష్టపడి చదివించి కంటిక రెప్పలాగు చూసుకున్న తండ్రికి వారి అభ్యుదయం చూసే అదృష్టం లేకపోయింది.

తొలినాడు చూపు కలిసింది మొదలు చివరి క్షణం వరకు సున్నితంగా పువ్వులా చూసుకున్న భార్య సుజాతని యీ ఇద్దరు బిడ్డలకీ వప్పగించి కన్ను మూశాడు. చెట్టుమీద వెచ్చగా గూట్లో వున్నాయి పక్షులు. యజమాని ఎగిరిపోవడంతో చెల్లాచెదురుగా ఆక్రందనలు చేస్తూ మిగిలాయి. సుజాతకి ఎవరున్నారు. వెనక్కి తిరిగి చూసుకుంటే మాత్రం ఎవరున్నారు?

*

అలకపాన్పు మీద అల్లుడు కూర్చున్నాడు. అట్టే బెట్టు లేకుండా అతనికి కావలసిందేమిటో చెప్పాడు. వినగానే నమ్మలేదు కొందరు. అడిగింది ఇస్తారో మానుతారో చూద్దామని పెళ్లికొడుకు అన్న, వదిన వేచి

వున్నారు. ముచ్చటగా మూడు పదుల వయస్సువాడు పెళ్ళికొడుకు. అమ్మాయి పదేళ్ల బాలిక. పేరు సుజాత. "రెండో పెళ్ళి వాడైతేనేం. అందగాడు. పిల్లలు లేరు. బోలెడు ఆస్తి" అనుకుని యివ్వడానికి సిద్ధపడ్డాడు తండ్రి. పెళ్లి ఘనంగా జరిగింది. మగపెళ్లి వారి ముచ్చట్లు, కోరికలు తీర్చబడ్డాయి. ఇప్పుడింక అలకపాన్పు వ్యవహారం ఇలా పరిణమించింది.

అత్తవారింటికి రావాలంటే ఒక వాగు దాటాలి. అది అందరిలా కాక, ఘనంగా దాటి రావాలని అతగాడు ఒక ఏనుగు కావాలని అడిగాడు. ఏనుగు. బ్రతికున్న మేరువు లాంటి జంతువే! పెళ్లి కుమారుడు నాలుగు ఏనుగులని పోషించగల సమర్ధుడు. జాగీర్దారు. సరే ఏనుగుని తెచ్చి యిస్తామన్నారు అత్తవారు.

ఏనుగు వచ్చిన తరువాత రెండు సార్లు వచ్చాడేమో అత్తవారింటికి అల్లుడు. ఆ తరువాత అతను రానేలేదు. పెళ్ళి కూతురు సుజాత మాత్రం, పదమూడో ఏట అత్తవారింటికి వెళ్లిపోయింది. ఆమెను పుట్టింటికి పంపలేదు. అతను అత్తవారింటికి వెళ్లలేదు. అతని పేరు నారాయణరావు.

సుజాత ఎర్రని పిల్ల. మాణిక్యం అంటారందరూ. కాస్త చప్పుడుకి బెదిరి చూసే కళ్ళు నుదుటి మీద చిందరగా పడి పోయే నొక్కుల జుట్టు. కొనదేలిన ముక్కు. తమలపాకు తీగెలాంటి సుజాతని చూస్తే నారాయణరావుకి పట్టలేని సంతోషం కలిగింది. వాలిపోయే కళ్ళల్లో వణికిపోయే ఎర్రని పెదిమలలో కోమలత్వం కనబడి అతను ముగ్ధుడైపోయాడు. మొదటిభార్య అనారోగ్యంతో రెండేళ్లు తీసుకుని పోయింది. ఇరవై ఎనిమిదేళ్ళ వయస్సులో భార్యని పోగొట్టుకున్నాడు. రెండేళ్లు తిరగకుండానే లేత మొగ్గలాంటి సుజాత దొరికింది. ఆమెను పుట్టింటికి పంపాలనిపించలేదు. తను అత్తవారింటికి వెళ్లే అవసరమూ లేదు. అందుకే రెండేళ్ళుపోయాక ఏనుగుని వేణుగోపాల స్వామి దేవాలయానికి దానం చేసేశాడు.

నారాయణరావు అంత దర్జామనిషి. ఠీవిగా బతకాలని ఎవరికీ లేని దర్జా తనకి వుండాలని కోరిన వాడు కాబట్టే మత్తేభాన్ని కోరి దాన్ని పొంది కృష్ణార్పణం చేశాడు.

సుజాతకి యింట్లో పని ఎక్కువ వుండేది కాదు. తోడికోడలు ఏదైనా చేసుకుంటూంటే కూడా తిరిగేది. నీళ్లు చేదుకోవాలంటే అరచేతులు కంది పోయేవి. పాలేళ్ళు తోడిపోసేవారు. అటు పెద్ద కోడలు చూడకుండా, చూస్తే ఆ నీళ్ళు యింట్లోకి పనికి రావు. తోడికోడలు కమల సుజాతకి పూల జడలు వేసేది. సన్నని వంటికి తెల్ల చీరలు కట్టేది. ఎంత అలంకారం చేసినా, అందంగా ఆకులతో మెరిసిపోయే మొక్కకి రంగు కాగితాలు కట్టినట్టుండేది కాని అతికేవి కాదు. అలంకారం అవసరం లేని రూపం సుజాతది.

మరిది ఒకటి రెండు రోజులు ఇంటికి రాకపోతే కమలకి అర్ధమయ్యేది అతను ఎటు పోయాడో. సుజాత చిన్న పిల్ల. ఆమెకు ఏం చెబుతుంది? సుజాతకి అతను రాకపోతే మరీ నయం. హాయిగా ప్రొద్దు గ్రుంకేసరికే నిద్రపోయేది.

నారాయణరావుకి పెళ్ళయ్యాక పెద్దరికం వచ్చింది. అందువల్ల తను పగలు చూసిన పడతి రాత్రి అయేసరికి మేనాలో యింటికి వాలేట్లు చూసేవాడు. చుట్టుప్రక్కల గ్రామాల్లోని వార వనితలందరితో పరిచయం అతనికి. అంతటి రసికుడు.

మూడు నాలుగేళ్ళు గడిచేటప్పటికి పూర్తిగా అర్థం కావడం మొదలెట్టాయి యీ సంగతులన్నీ సుజాతకి కూడా. అప్పటికే అలసిపోయింది శరీరం. పదహారేళ్ళే ఆమెకి. కానీ పాతికేళ్ళ అనుభవం వచ్చింది. కష్టాలు తెలిశాయి. నారాయణరావు లాలనకీ, పాలనకీ అర్ధాలు. కసుర్లకీ, విసుర్లకీ భాష్యాలు తెలుస్తున్నాయి ఆమెకి. చిన్నప్పట్నించీ చక్కని చుక్క అని అందరిలో పేరు. సహజంగా అందంగా విచ్చే పూవులు. బంగారు రంగులో మెరిసిపోయే చేపలు తమ అందం చూసి గర్వపడిపోవు. అలాగే సుజాత కూడా. భర్త అడ్డదారులు త్రొక్కి, ఎందరో ఆడవాళ్ళతో కాలం గడుపుతున్నాడన్న తరువాత తన అందానికి అసలు విలువ లేకుండా పోయింది.

విపరీతమైన లాలసతో బ్రతికిన వాళ్ళకి ఏమి జరుగుతుందో అదే జరిగింది నారాయణరావుకి. శరీరానికి రకరకాల బాధలు పట్టుకున్నాయి. మానని పుండ్లు కనిపించసాగాయి. సుమారు పదిహేను సంవత్సరాలు సుఖమనుకుని అనుభవించిన వాటి పర్యవసానంగా ఆ వ్యాధులు పట్టుకున్నాయి. అదుపు చేసేవాళ్ళు లేక తిరిగినందున అనుభవించసాగాడు. సుజాత ఉపచారం చేస్తోంది. తనని అతడు కొట్టాడు. హింస పెట్టాడు. ఐనా ఆమె చాకిరీ చేస్తోంది. తను పుట్టిన యిల్లు, మెట్టిన ఇల్లు కూడా చెప్పిన నీతి అదే. ఆడవాళ్ళంటే చరాస్థి వంటివారు. ఇంట్లో గోవు, చేలో ఎద్దు ఎటువంటి సంపదో అటువంటి వారే స్త్రీలు. వాళ్ళకి వేరే ఆలోచనలు,బాధలు కూడానా! అతని వల్ల తనకి సుఖం లేకపోతేనేమి. త్రాగి తందనాలాడి, పరగణాలోని పడుపుగత్తె లందరితో సంబంధాలు పెట్టుకుంటేనేమి! రోగాలు వస్తే నేమి? తాను ఆ యింటి కోడలుగా పశువులాగా వుండవలసిందే. చిన్న దొరగారి భార్యగా చలామణి కావలసిందే!

అలాగే అనుకొని బ్రతుకుతోంది సుజాత. పందొమ్మిదవ సంవత్సరం యింకా నిండలేదు. శరీరమే యింకారూపు దిద్దుకోలేదు. కాని జీవితానికి చరమాంశం ప్రారంభమైంది. బిడ్డా, పాప కలిగే యోగ్యత వుందో లేదో?

మురళీధరరావు అనే యువకుడు యింట్లోపిల్లలకి పాఠాలు చెప్పడానికి వచ్చాడు. అతను బి.ఏ. చదువు కున్నాడు. నారాయణరావుకి ఒక అక్కగారుంది. ఆమె కొడుకు శ్రీపతిరావుకి యీ మురళీధర్ క్లాసుమేటు. మురళికి ఒకసారి పరీక్షపోయింది. మళ్లీ పరీక్ష వరకు పట్నంలో వుండి చదివే శక్తి లేదు. అందుకని స్వగ్రామం వచ్చాడు. ఇంట్లో జరుగుబాటు తక్కువ. అందుకని పిల్లలకి ట్యూషన్ చెప్పడానికి కుదిరాడు. పెద్ద దొరగారి పిల్లలు ఇద్దరు, వారి అక్కగారి పిల్లవాడు ఒకడు-అంటే శ్రీపతిరావు తమ్ముడు, ఒకటి, నాలుగు, ఆరో క్లాసులు చదువుతున్నారు వాళ్ళు.

మురళీధర్‌కి ఇరవై సంవత్సరాలుంటాయి. చిన్న దొరగారి భార్య చక్కనిదని విన్నాడు కానీ, యిలా గులాబీ మొగ్గలాగు వుంటుందనుకోలేదు. తల వంచుకునో, ముంగిట్లో బాదం చెట్టుని చూస్తూనో పాఠాలు చెప్పేవాడు కాస్తా, మట్టెల చప్పుడు వింటే తలెత్తి చూచేవాడు. పిల్లల్ని అన్నాలకి కేకవేయడానికి వచ్చేది ఆమె. లేదా వీధిలోని ముష్టి వాడికి బియ్యం పోయడానికి వచ్చేది. అప్పుడు తనవంక అతను చూస్తే ఎవరూ యిదివరకు చూడని పద్ధతిలో చూడ్డం గమనించింది.

వానాకాలం గడిచింది. మురళీ పరీక్షలు వ్రాయడానికి పట్నం వెళ్ళి తిరిగి వచ్చాడు. శ్రీపతిరావుకి బి.ఏ. పూర్తి అయింది. ఇక మీదట ఏమి చేయాలని మేనమామలని అడగడానికి వచ్చాడు. వాళ్ళే అతనికి చదువుకో వడానికి సాయం చేశారు. పిల్లలకు పాఠాలు చెప్పించాలని పెద్దగా ఎవరికీ లేకపోయినా, పోనీ సాటివాడు పది రూపాయలు తింటాడు కదా అని మురళీ విషయంలో అనుకున్నాడు. శ్రీపతికి స్నేహితుడికి సాయపడదామని కోరిక వున్నా శక్తి లేదు. అందుకని మేనమామల యింట ఆ వసతి కల్పించాడు.

సంక్రాంతి పండుగనాటికీ నారాయణరావు స్థితి చాలా విషమంగా ఉంది. పట్నం తీసుకొని వెళ్ళమన్నారు. సుజాత కూడా వెళ్ళింది. ఆమె పుట్టింటి వారు వచ్చారు. హాస్పిటలులో చేర్చాక అతనికి వున్న బాధలు ఒకటి కాదు. పది అని తేలింది. ఒక నెల గడిపాడు. ఆరు వందల రూపాయలు హరించుకొని పోయాయి. తిరిగి తీసుకుని వచ్చారు. వేసవి కాలం రాత్రి యీదురు గాలి వీస్తోన్న సమయంలో నారాయణరావు యమయాతన పడ్డాడు. ఊరిలోని వారి వైద్యానికి లొంగని బాధ అది. తెల్లవారేసరికి కన్ను మూశాడు. నలభై రెండు సంవత్సరాలు. అన్నగారు యాభై ఎనిమిదేళ్ళ మనిషి. పదిహేను రోజులు గడిచాయి. సుజాతని పుట్టింటి వారు తీసుకుని వెడతామన్నారు. ప్రయాణం చేయించి సాగనంపేందుకు ఏముంది.

ప్రొద్దు వాలుతోంది. సుజాత బావి దగ్గర నీళ్ళు తోడి మల్లెపాదులో పోస్తోంది. భర్త పోయి మూడు వారాలు తిరక్కుండానే ఆమె లేచి తిరగటం, అందులో పూల తీగెకి నీళ్ళు పోయడం విడ్డూరమే కావచ్చు.

కానీ, ఆ బావికి, మల్లెపాదుకి, ఆమెకి ఉన్న అనుబంధం అలాంటిది. పరధ్యానంగా ఆమె నీళ్లు పోస్తోంటే పెరట్లోకి ఎవరో వచ్చిన అలికిడైంది. ఆమె తలెత్తేసరికి మిత్రులిద్దరూ కనబడ్డారు. శ్రీపతి, మురళి కలిసి. ఎందుకు వచ్చారో గానీ పెరట్లోకి వచ్చారు. సుజాత చేతిలోని చేద పడేసి, వెనక్కి తిరుగుతోంటే శ్రీపతి, "అత్తయ్యా, మాట" అన్నాడు.

ఆమె బెదురుగా నిలబడింది. అతను దగ్గరకు వచ్చి "నువ్వు మీ వాళ్లింటికి వెళ్లిపోతావా? వాళ్ళు ఏం చేస్తారు?" అన్నాడు. ఆమెకు అర్థం కాలేదు. యీ ప్రశ్న. ఏం చేస్తారు. శేష జీవితమంతా అన్నం పెడతారు.

శ్రీపతి తడబడ్డాడు. "మురళికి మంచి చోటు ఒకటి తెలుసు. నీలాంటి వాళ్ళని చదివించే చోటు వెడతావా?" అన్నాడు. ఆమె అర్థం కానట్లు చూస్తోంటే, "చిన్న దానివి కదా! భర్త పోయిన వాళ్లందరూ యింట్లో వూడిగాలు చేస్తూ కూచోవడం అన్యాయం. మేమిద్దరం నాలుగు రోజుల్నుంచీ ఆలోచిస్తున్నాం. వెడతారా?" అన్నాడు. సుజాత ఆశ్చర్యంగా చూసింది. మురళి అక్కడ నిలబడ్డందుకే ఆమెకు గుండె గబగబ కొట్టుకుంటూంది. అతను అక్కడకు తీసుకుని వెడతారనేసరికి శరవేగాన పని చేసింది గుండె.

"ఎవరేనా వస్తారేమో చూడూ. నేను చాలా ధైర్యం చేయాలని అనుకున్నాను. నీకోసం, మేము చదువుకున్నందుకు ఆ మాత్రం తెగింపు ఉండవద్దా? రాత్రి పదిన్నర, పదకొండుకి లేచి యీ వేపు రా!" అన్నాడు శ్రీపతి. సుజాత మాట్లాడలేదు. విన్నదో లేదో గానీ గబగబ యింట్లోకి వెళ్ళింది. గుండె దడ తగ్గలేదు. శ్రీపతిని చిన్న కుర్రవాడుగానే అనుకుంది తను యిన్నాళ్ళు. కానీ,అతను కొంత వరకు వాదించడం వల్లనే పదో నాడు జరిగే ఘోరమైన తంతు ఆగింది. ఇప్పుడు కూడా తనకి చాలా అన్యాయం జరుగుతోందన్న ఆలోచన ఉంది. కానీ, అదేమిటో స్పష్టంగా తెలియదు ఆమెకి. పుట్టింటికి వెడితే సుఖం దొరుకుతుందనా? కాదు. ఎప్పటికి తెల్లవారను యీ బ్రతుకు?

శ్రీపతి చెబుతున్నది ఏమిటి? ఇంట్లోంచి వెళ్ళమంటాడా? అన్నీ వదిలేసి వెళ్ళాలా? భయం వేస్తోంది. అతను చెప్పింది వెళ్ళిపొమ్మనే. సుజాత కంటే ఏడాది చిన్నవాడు. అంత ఆలోచన ఎలా వచ్చింది. మురళి చెప్పి వుంటాడు. ఆ పేరు తలచుకోగానే సుజాతకి గుండెదడ ఎక్కువైంది. ఎక్కడ దింపుతాడు తనని తీసుకు వెళ్ళి? తనకి చదువు ఏంవస్తుంది! తెలుగు అక్షరాలు కూడా సరిగా రావు. చదువుకుని ఏం చేస్తుంది. తల్లి, పినతల్లి, చిన్నన్నయ్య వచ్చారు. తీసుకుని వెళ్ళడానికి. ఇంట్లో మరెందరో బంధువులున్నారు. తోడికోడలు, తను ఒక ప్రక్కనే పడుకుంటున్నారు. పల్లెటూరు కనుక, ఎనిమిది కాకుండా అందరు పక్కలు పరచుకుంటున్నారు. భోజనాల దగ్గరికి కూడా సుజాత వెళ్లడం లేదు. జబ్బుపడి లేచిన మనిషిని చూచినట్లు చూస్తారందరు.

పెద్ద గడియారం తొమ్మిది కొట్టడం విన్నది. మనస్సు మనస్సులో లేదు. తనవూళ్ళో, తన వంశంలో, తన ఎరికలో మొగుడు పోయిన మనిషి చచ్చిపోయినట్టే లెఖ్క కదా! అలా కట్టి తీసుకుని వెళ్ళి కాల్చిన సంఘటనలు కూడా చిన్న తనంలో విన్నది. తనకి ఆయన పోయినందుకు దు:ఖం కనబడటంలేదు.

అలా అనుకోవడమే పొరబాటు. గడియారం అరగంట కొట్టింది. పదిగంటలు కొట్టింది. కుక్కలు కూడా అరచి ఏడిచి మానేశాయి. రావి చెట్టు మీద మాత్రం వెన్నెల తళుకల్లా వున్నాయి మబ్బులు. వసారాలో పడుకున్న సుజాత లేచి కూర్చుంది. అందరూ నిద్రలో వున్నారు. రేకు గేటు చప్పుడైంది. గొంతు ఆర్చుకొని పోతోంది సుజాతకి. గడియారం అరగంట కొట్టింది. లేచి మెల్లిగా యింటి లోపలికి వెళ్లింది. పెరటి వేపు తలుపు తీసి మెల్లిగా అడుగులు వేస్తూ వెళ్లింది. నూతి దగ్గరే ఉన్నారు మిత్రులిద్దరూ.

"చిన్నత్తా వచ్చావా? అమ్మయ్య రావని భయపడ్డాను. నీ బట్టలేవీ? తెచ్చుకోలేదా?" అన్నాడు శ్రీపతి.

"లేదు" అన్నదామె.

"నువ్విక్కడే వుండు. అసలు ఏమీ బట్టలు లేకపోతే ఎలాగు? కావడి పెట్టెలోంచి నాలుగు చీరెలు పట్టుకొస్తాను! నగలున్నాయా?" అన్నాడు శ్రీపతి.

"లేవు" అంది సుజాత.

శ్రీపతి లోపలికి వెళ్ళాడు. కాళ్ళు వణకడం మొదలు పెట్టాయి. మురళి ఏమీ మాట్లాడక నిలబడి వున్నాడు.

పదిహేను నిమిషాలకి వచ్చాడు శ్రీపతి. పెద్ద సంచి నిండుగా ఏవో పట్టుకొచ్చాడు. "పద. తొందరగా పద" అన్నాడు. ముగ్గురూ కలిసి గేటు దాటి నిర్జనమైన సందుల గుండా గబగబా నడిచారు. ఒక మైలు నడవాలి. అక్కడ రైలు స్టేషను. దోవ పొడవునా శ్రీపతి ఏవో చెబుతున్నాడు. అవునా కాదా అని మురళి అడుగుతున్నాడు. ఆ మాటలు వింటూ నాగస్వరం వెంట నడిచిపోయే పాములా వారి వెంట నడిచింది సుజాత.

తనని రైలు ఎక్కిస్తారు. శ్రీపతి డబ్బు తెచ్చాడు ఎక్కణ్ణుంచో.

స్టేషను కనబడుతోండగా శ్రీపతి "నేను వెళ్ళిపోతానింక. ఇంటిలో ఎవరైనా లేస్తే అనుమానం వస్తుంది. రైలు పన్నెండుంబావుకి వస్తుంది. రేపు మధ్యాహ్నంకల్లా వెళ్ళిపోతావు. భయపడకు అత్తా. ఏం? భయం లేదు. నేను ఎప్పుడైనా వస్తాను. చూస్తాను ఏం?" ఆమె ఏమీ జవాబివ్వకుండానే అతను వెనక్కి తిరిగాడు. మురళి, సుజాత స్టేషనులోపలికి వెళ్ళారు.

చాలాసేపు కూర్చున్నారు. రైలు లేటు. ఇంకా టిక్కెట్లు కూడా యివ్వడం లేదు. బెంచీ మీద కూలబడిందామె. అతనూ ప్రక్కనే కూర్చున్నాడు.

"మీరు రారా? నాతో!" అన్నదామె మెల్లిగా.

"వద్దనుకున్నాము. రావడం మంచిది కాదు. మీకు ఏమీ భయం లేదు. నేను మా క్లాసుమేటుకి వుత్తరం వ్రాసి పెట్టాను. స్టేషనుకి చాలా దగ్గర. ఉత్తరం యిస్తే అతనే తీసుకెళ్ళి అక్కడ చేర్పిస్తాడు" అన్నాడతను.

సుజాత మోకాళ్ళ మీద తలపెట్టి కూర్చుంది. భయంగా వుంది. ఒణుకు వస్తోంది. వెనక్కి వెళ్ళిపోతేనో. అమ్మ దగ్గరేనా వుండవచ్చు చల్లగా. తనకు ఏమి లోటుందని యిలా పరుగెత్తుకు వచ్చింది.

"నేను ఇంటికి వెళ్ళి పోతాను. దింపేయరూ!" అన్నదామె.

మురళి ఏమీ జవాబు చెప్పలేక, చీకటిలో అర్థం కాని చూపు చూశాడు.

"ఎందుకు? చదువుకోరా? ఇంకా ఎంతో జీవితం ఉ:ంది. చదువుకొని మీ కాళ్ల మీద మీరు నిలబడితే, వీళ్ళంతా మీ దగ్గరికే వస్తారు. మన ఆచారాలు చాలా ఘోరం. చచ్చిపోయిన మనిషి క్రింద జమకడతారు. మీరూ స్వంతంగా ఆలోచించుకోవాలి కొంత" అన్నాడు.

"నాకు చదువు రాదు ఏమీ రాదు భయం వేస్తోంది. ఒక్కత్తైనూ పోలేను. ఇంటికి వెళ్ళిపోతాను. నాకు రాత్రిళ్ళు భయంలేదు. ఒక్కత్తెనీ వెళ్ళిపోతాను లెండి యింటికి" అని లేచి నిలబడిందామె.

అతనూ లేచాడు. "వద్దండీ. శ్రీపతి కోప్పడతాడు. చదువు రాకేం. వస్తుంది. ఆ పల్లెటూళ్లో మ్రగ్గిపోతే ఏం లాభం! జీవితమంతా ముందే వుంది కదా! కూర్చోండి" అన్నాడు.

ఆమె కూర్చుంది. "నాకు ఏమీ చేతకాదు. రైల్లో కూడా నేను ఒక్కత్తైనే కూర్చోలేను" అన్నదామె. మురళి పట్టాల వంక చూస్తున్నాడు.

రైలుకి గంట కొట్టారు. "నేను వెళ్ళి టిక్కెట్టు తెస్తాను" అని లేచాడతను. "వద్దు" అందామె ఏడుపు కంఠంతో.

"వద్దంటే ఎలాగండీ?" అన్నాడతను.

"నేను పోను. యింటికి వెడతాను."

"ఇప్పుడు రెండు గంటలు కావస్తోంది ఎలా వెడతారు? మీ ఇంట్లో ఎవరేనా లేచి వెతుక్కుంటారు" అన్నాడు మురళి.

ఆమె కూలబడింది. నోరు నొక్కుకుని ఏడుస్తోంది. మురళి దగ్గరగా వచ్చి, వణికే కంఠంతో "పోనీ, పట్నం వెడదాం వస్తారా నాతో!" అన్నాడు. కొంతసేపటికి ఆమె తల ఎత్తి చూసింది చెట్టు నీడ పడుతోంది ముఖాల మీద. అతని తెల్ల బట్టలు మినహా ఏదీ స్పష్టంగా ఉండటం లేదు. కానీ అతని కళ్లల్లోకి చూసింది. తల వూపింది. అటు వెళ్లే రైలు కాక, యిటు వచ్చే రైలు మరో గంటకి ఎక్కారు.

❋

ఆరోజుల్లో మురళి యింట్లో ఎవరికీ చెప్పకుండా పట్నంలో స్నేహితుడి రూములోకి సుజాతని చేర్చాడు. ఒంటరిగా పోనని ఏడ్చిన సుజాత అతని చేయి పుచ్చుకుని రావడానికి వప్పుకుంది. కోరికలు పుట్టడానికి వీల్లేని వాతావరణం లోంచి బయట పడిన, అలసిపోయిన శరీరం ఆమెది. నీ కళ్ళల్లో నీడలు చూసుకోనీ అనిగానీ, నీ ముక్కు కొనని వున్న అందాన్ని ముద్దుపెట్టుకొనీ అని గానీ, మోహపెట్టే వలపు ఎరుగని బ్రతుకు. సమవయస్కుడు మురళి. వీరిద్దరూ కాపురం ప్రారంభించాక స్నేహితులు కూడా అర్థం చేసుకుని రావడం మానేశారు. బి.ఏ. ప్యాసయినట్లు రిజల్టు తెలిసింది. ఎక్కడికయినా దూరానుండే వూరికి పోయి ఉద్యోగం చూసుకుంటానన్నాడు. అన్నట్లుగానే చిత్తూరులో టీచరు ఉద్యోగం దొరికింది.

అక్కడికి వెళ్ళిన రెండు నెలలకు, "పెళ్ళి చేసుకుందాం సుజా!" అన్నాడు. తల మునకలయిపోయే మోహంలో ఆమెకు ఆ ఆలోచనే రాలేదు. ఎన్నాళ్ళకో దొరికిన ఆశ్రయాన్ని పైన వేసుకోవాలనే. నిలదొక్కుకుని ఆలోచించే తాహతు లేదు. అప్పుడు ఆ వూళ్లోనే గుళ్లో ఆమె కడుపులో రమణమూర్తి మూడు నెలల వాడై ఉండగా తాళి కట్టాడు మురళి. అంత సాహసం ఆ కుర్రవాడి చేత చేయించింది ఆమె అందం. శ్రీపతికి కూడా చెప్పలేదు. మురళి ఎం.ఏ. పాసై లెక్చరరు అయ్యాడు మరో ఐదేళ్ళకి. అప్పటికి ఇద్దరు అబ్బాయిలు పుట్టారు. రమణమూర్తి, కామేశ్వరావు. రెండు మూడు పట్నాలు ట్రాన్సఫరు అయి తిరిగారు.

ఇదంతా జరిగి ఎనిమిది సంవత్సరాలయింది. ఆ ఆనందంలో ఆమె వున్నప్పుడు ఆమెకు శ్రీపతి గుర్తుకు వచ్చేవాడు. తనకీ బ్రతుకు యిచ్చినవాడు అతను. అడవిలో మ్రాను అందమైన పూలు పూసి, కాయలు కాచి, రాలి పోవలసినదే. కానీ దానికో బరువు అందం, సాఫల్యము తన మనిషిగా కల్పించాడు. ముగ్గురు చెట్టంత వాళ్ళు దొరికారంటే అది శ్రీపతి చలవే అతను ఎక్కడున్నాడు. తనకి వ్రాసే సాహసం లేదు. మురళి అప్పట్లో వ్రాసిన జాబులకి సమాధానాలు లేవు.

❋

ఇన్నేళ్ళకి ఈ రోజు రమణ వచ్చి 'ఉత్తరాలు ఎవరికి వ్రాయాలమ్మా నాన్నగారు పోయారని!' అని అడిగితే శ్రీపతి మినహా మరో మనిషి గుర్తు రాలేదు. కానీ అతను ఎక్కడున్నాడు?

మురళీధర్ పోయి రెండు సంవత్సరాలైంది. అతనితో సుజాతకి తొలి పరిచయం చూపులతో. ఆతరువాత వళ్లు తెలియని మోహం, మమకారం. ఒక్కోరోజు గడుస్తున్నకొద్దీ అతనికి చేరువైంది. చెంపలు నెరిసినా, రంగు తరిగినా, వళ్ళు వయస్సుతో ముదిరిపోతున్నా ఆమెని తమల పాకులాగ చూసుకున్నాడతను. ఎన్నడూ ఆమె తన వాళ్ళని గురించి ఆశలు పెట్టుకోలేదు. అర్థరాత్రి వేళ యిల్లు, తన వాటా ఆస్థి, పరువు, మర్యాద, వైధవ్యము అన్నీ వదిలేసి నప్పుడే మురళి తన సర్వస్వం అనుకుంది. అతని వాళ్ళు వీళ్ళని వెలివేశారు. తల చెడిన మనిషిని, నెల తిరక్కుండా లేవదీసుకుని పోయిన త్రాస్టుడు. వాడికింక పుట్టగతులుండవు అని నిశ్చయించారు. తల్లి కూడా క్షమించలేదు.

పిల్లలకి తల్లి, తండ్రి మినహా నా అన్నవారు తెలియదు. కష్టపడి సంపాదించి, స్కాలరుషిప్పుల మీద ప్యాసైన వారిద్దరికీ మంచి ఉద్యోగాలొచ్చాయి. కామేశ్వరావు హైదరాబాదులో ఇంజనీరు. రమణ బందరులో డాక్టరు. ఈ సమయానికి మురళిని పరువానికి వచ్చిన పండుని వూసినట్లు అవతల పారవేశాడు భగవంతుడు.

మబ్బుగా వుంది ఆకాశం ఏక్షణానికైనా పెద్ద వర్షం కురవచ్చు. సుజాత రెప్ప వేయకుండా చూస్తోంది. బయటికి నిట్టూర్పుకూడా రావడంలేదు. ముందు గదిలో రమణ కూర్చున్నాడు. కాస్సేపటికి అతను లోపలికి వచ్చాడు. అప్పుడు సుజాత తల త్రిప్పి చూసింది.

అతను తల వంచుకుని లోపలికి వెళ్లాడు. పీట వాల్చుకుని, అన్నం పెట్టుకున్నాడు. ఆమె మెల్లిగా లేచింది. వంటింటి గుమ్మం దగ్గర నిలబడి చూసింది. గబగబ తింటున్నాడు అన్నం. తల ఎత్తి తల్లి వంక చూసి మంచి నీళ్లు త్రాగాడు. తినడం ఆపేశాడు. ఆమె వెళ్ళి నెయ్యి వేసింది. కలుపుకుని తినడం మొదలు పెట్టాడు. సుజాతకి కడుపు లోపల్నించి దుఃఖం వస్తోంది. తండ్రి పోయి రెండు సంవత్సరాలు కాలేదు. తాము ముగ్గురు కలిసినా వంటరితనంతో బాధ పడ్డారు. ఆరోజులన్నీ ముగ్గురూ ఒకటిగా ఎలా గడిపారో మర్చిపోయాడా రమణ?

మనస్సులోని మాట చెప్పుకోవడానికి వీల్లేకుండా తయారయ్యారు బిడ్డలిద్దరూ. తనని అమ్మా అని పిలిచి అన్నం పెట్టించుకోవడమే కరువైంది.

"నాయనా, తమ్ముడు నీకు వుత్తరం వ్రాశాడా?" అన్నది.

"ఊ!"" అన్నాడు కొంచెం ఆగి "నీకు డబ్బు పంపించినప్పుడు వ్రాశాడుగా?" అన్నాడు రమణ.

"వ్రాశాడు" అన్నదామె కామేశ్వరావు డబ్బు పంపుతూ మనీ ఆర్డరు కూపను మీద వ్రాశాడు క్షేమం అని, అదే వుత్తరం అంటే.

వాడు ఎవరో అమ్మాయిని పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాడు. ఉద్యోగం వచ్చినప్పటినుంచీ, అతను అద్దెకుంటున్న యింటివారమ్మాయి, ఆ అమ్మాయి తల్లి తండ్రులు 'మీవాళ్లతో మాట్లాడతాం' అన్నారుట. మా వాళ్లెవరు లేరు అని. అమ్మ వుందని చెప్పాడుట కామేశ్వరావు తాతలు, మేనమామలు... ఎవరికీ సంబంధం లేదు. చెప్పుకోదలిస్తే కొన్ని పేర్లు తెలుసు. అడ్రస్సులు తెలియరు. కష్టానికి, సుఖానికి ఎవరూ రారు. ఆ మాటే వాళ్ళతో చెప్పాడు. అది కామేశం సంగతి.

రమణకి బందరులోనే సంబంధాలు వస్తున్నాయి. గొడుగుపేటలోని ఒకరు వచ్చి పిల్లనిస్తామని అడిగి వెళ్ళారు...రమణకి యిష్టమైంది ఆ పిల్ల ఎందుకనో వాళ్ళు మళ్ళీ రాలేదు. రెండు సంబంధాలు నిశ్చయమైనాయో లేదో జరుగుతాయో జరగవో తెలియదు.

రమణ భోజనం ముగించాడు. తల్లితో ఏమీ మాట్లాడక కంచంలో చేయి కడుక్కున్నాడు. లేవబోతుంటే, "మళ్ళీ వెళ్లాలా హాస్పిటల్‌కి" అన్నదామె.

"వెళ్లాలి. పనుంది" అన్నాడు. ముందు గదిలోకి వెళ్ళి పడక కుర్చీలో కూర్చున్నాడు. అతని మనసులో ఏదో వేడిగా ఉడుకుతోంది. తమ్ముడి ఉత్తరం చూశాక అతనికి అమ్మ ముఖం చూడాలనిపించడం లేదు. తమ్ముడికి వచ్చిన సంబంధం వాళ్ళు వెనక్కి పోవడానికి కారణం తెలిసింది. పిల్ల తండ్రి చెప్పాడుట తనకి యీ సంబంధం వద్దని. ఆయన తన కూతురికి చెప్పాడు. ఆమెని కామేశం బలవంత పెట్టిన తర్వాత ఆమె బయట పెట్టింది.

"మీ అమ్మగారికి రెండో పెళ్ళిట కాదా? అంచేత మా వాళ్లెవరికీ యిష్టం లేదని" చెప్పింది. "అమ్మ సంగతి, నాన్న సంగతి తెలిసిన వాళ్లెవరూ మనకి కాళ్ళు కడిగి పిల్లనివ్వరు అన్నయ్యా!" అని వ్రాశాడు వాడు.

ఇదేనా కారణం! గొడుగు పేట సంబంధం వెనక్కి పోవడానికి కూడా కారణం యిదేనన్నమాట. చిన్నప్పట్నించీ ఎవరూ బంధువులన్నవాళ్ళు తెలియకపోయినా లోటు అనిపించలేదు. ఎక్కడికీ పెళ్ళిళ్ళకిగానీ, సెలవుల్లోగానీ వెళ్ళక పోయినా ఏమీ అనిపించలేదు. ఎందుకు మనం వెళ్ళడం లేదు. మనింటికి ఎవరూ ఎందుకు రారు అని నాన్నని నోటితో అడగలేదు. ఎల్లాగో తెలిసింది అందరూ వెలివేశారని. కానీ యింత బలంగా వుంటాయా కట్టుబాట్లు! తమ్ముడు ఆ పిల్ల అంటే చాలా యిష్టపడ్డాడు. తనతో ఆ పిల్ల సంగతి మాట్లాడే టప్పుడే తెలిసింది అతని నవ్వులో. ఆ పేరు ఉచ్చారణలో ఆమె అంటే ఎంత కోమలమైన భావం పెంచుకున్నాడో, తను మాత్రం? గొడుగు పేటలోని ఆ అమ్మాయిని చూశాక, తనకు కాబోయే ఒక వ్యక్తిగా ఆమెని వూహించు కున్నాడు. చిన్న పులకరింత. సంసారి కాబోయే ఒక ఠీవి వచ్చాయి. అవన్నీ తుంచివేయడం జరిగింది యిప్పుడు కారణం అమ్మ.

సుజాత గుమ్మం దగ్గరకు వచ్చి నిలబడింది. “రమణా, తమ్ముడు నీకు ఏమని వ్రాశాడు వుత్తరంలో!” అనడిగింది. అతని షర్టు జేబులో పైకి కనబడుతున్న ఇన్‌లాండ్ కవరు. రమణ ఒకసారి తల్లి వంక చూశాడు.

తెల్ల చీరెతో, కొంచెం నెరిసిన తెల్ల జుట్టు వ్రేలి ముడితో నిలబడి వుంది. కళ్ళు ఎర్రబారినాయి. అతను లేచి ఉత్తరం తీసి యిచ్చాడు. ఆమె దాన్ని అందుకొని చదివింది. ఎంతసేపో కదలిక లేకుండా నిలుచుంది. గుండె విలవిలలాడింది. అవమానం, ఉక్రోషం. కొడుకు అభిమానం విడనాడి అంతమాట వ్రాశాడన్న పెద్దపోటు. ఒక్కసారి తగిలి ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆనాడు తను చేసిన పనికి శిక్ష బిడ్డలకు పడుతోందా? మీకేమిరా నాయనా, యివి కాకపోతే లక్ష సంబంధాలు వస్తాయి అని తను అనడానికే అవకాశం లేదు. కామేశ్వరావు యిష్టపడిన పిల్ల అతనికి కాకుండా పోతుంది. అందుకే అంత బాధ పడ్డాడు.

కొంతసేపటికి ఆమె దుఃఖం ఆపుకుని, “రమణా నేను హైదరాబాద్ వెడతాను. కామేశం పాపం ఏం చేస్తున్నాడో చూస్తాను” అన్నది.

“ఎందుకిప్పుడు?” అన్నాడు రమణ.

“నాకు వెళ్ళాలని ఉంది. నీ దగ్గిర డబ్బుంటే నన్ను పంపించు. లేకపోతే నాన్నగారి తాలూకు సొమ్ము బ్యాంకిలో వేశారుగా! దాని మీద వడ్డీ యివ్వు! నాకు వెళ్ళాలని వుంది” అన్నదామె. యిక వాదించలేదు రమణ. ఆమెని మర్నాడు బస్సు ఎక్కించి తమ్ముడికి టెలిగ్రామ్ యిచ్చాడు. బస్సు స్టాండుకి కామేశ్వరావు వచ్చి టాక్సీలో యింటికి తీసుకుని వెళ్ళాడు. అతడిని ఆ తెల్లవారుఝామున చీకటిలో చూడగానే మనస్సులో ఎంత కష్టపడుతున్నాడో నా తండ్రి అని దు:ఖం వచ్చింది. ఇంటికి వెళ్లాక ఆమె స్నానం చేసి, కాఫీ త్రాగింది. రెండు గదులు, చాల చక్కగా వున్నాయి. కామేశ్వరావు చిన్న సంసారానికి కావలసిన సామాను కొంత చేర్చాడు. ఎందుకు వచ్చావని అతను అడగలేదు. సుజాత చాప వేసుకొని కూర్చుంది అతను కుర్చీలో అటు తిరిగి కూర్చుని కిటికీలో అద్దం పెట్టి గడ్డం గీసుకుంటున్నాడు.

“కామేశం! నువ్వు అన్నయ్యకి వ్రాసిన ఉత్తరం చదివాను. ఆ పిల్ల యిక్కడే వుందా? నేను చూస్తానురా!” అంది.

అతను కాస్సేపు ఏమీ సమాధానం చెప్పక, తర్వాత “ఎందుకు చూడ్డం? వాళ్ళ ఉద్దేశ్యం చెప్పారుగా?” అన్నాడు.

“అలా కాదు. నేను చూసి, వాళ్ళ వాళ్ళతో మాట్లాడితే తప్పేముంది?” అన్నది.

“ఎందుకు? అనవసరం. నేను కూడా గది ఖాళీ చేద్దామనుకుంటున్నాను” అన్నాడు. కొంచెం ఆగి, “వాళ్ళ నాన్న యీవేళో, రేపో వూరి నుంచి వస్తారుట. ఆయన రాగానే చెప్పేస్తాను. ఇందుకేనా నువ్వు పరుగెత్తుకుని వచ్చింది!” అన్నాడు.

ఆమెకు చాల కష్టం కలిగింది. వాడి బాధలు తనవి కానట్టు, యీపాటి దానికి ఎవరు రమ్మన్నారన్నట్టు

అంటున్నాడు. వాడు మనస్ఫూర్తిగా ఏరుకున్న పిల్లను తను చూసి, అవతలివాళ్ళని సిగ్గు విడిచి అడిగి, వప్పించి పెళ్ళి చేయించగలనేమో అనుకుంది. నీకెందుకు వచ్చిన గొడవ అన్నట్లు మాట్లాడుతున్నాడు.

ఆమె తడుముకుంటూ వంట చేసింది ఆవేళ. అతను కావలసినవి పట్టుకొచ్చాడు. పొడుగ్గా, అందంగా చేయెత్తువాడైనాడు కొడుకు. లేతరంగు టెర్లిన్ చొక్కా వేసుకుని, నొక్కుల జుట్టు క్రాఫు దువ్వుకుంటే, ఎర్రని క్రింది పెదవి తెల్లని పంటితో నొక్కి పెడుతోంటే చిన్ననాటి తను గుర్తుకు వస్తుంది. ఒక్క చూపులో మురళి పోలిక గుండెలు అలాగు తొలిచేస్తుంటుంది.

"నాయనా! నేను దిక్కుమాలినదానిలాగ ఒక్కతినీ పుట్టింటిలో ఉండలేక, మనిషిగా బ్రతుకుదామని మీ నాన్నతో వచ్చేశాను. మీ నాన్నగారు ఎంతో పుణ్యాత్ములు. మేము ఎవరికీ అన్యాయం చేయలేదు. మనస్సులు కలుపుకున్న గువ్వ పిట్టల్లాగ ఎగిరి వచ్చాము. మీరే మా ప్రాణమని పెంచుకున్నాము. ఇందులో తప్పు ఏముంది మీరు నిప్పుల్లాంటి పిల్లలని నేను చెబుతాను ఆ పిల్ల తండ్రికి, తల్లికి" అని కొడుకుని దగ్గరకు తీసుకుని చెబుదామని. కానీ అందుకు అవకాశం లేకుండా మౌనమనే ఒక పెద్ద గోడ కట్టాడు. కళ్ళలోకి చూడకుండా, మనస్సు విప్పకుండా బిగుసుకుని పోయి కూర్చున్నారు అబ్బాయిలిద్దరూ.

మర్నాడు ప్రొద్దున్న వాకిట్లోకి కూరగాయల బండి వస్తే, సుజాత గుమ్మంలో నిలబడి కావలసినవి చెప్పింది. ఇంతలో వాకిటిలోకి ఒక రిక్షా వచ్చి ఆగింది. టాపు లేదేమో అందులో కూర్చున్న మనిషి బాగా కనబడుతున్నాడు. సుజాత చిల్లర తెద్దామని వెనక్కి తిరుగబోయింది కాస్తా ఒక్కసారి ఆగింది. ఎవరాయన! తనకు తెలిసిన ముఖమే. కాకపోతే పెద్దవాడై పోయినాడు. బాగా వళ్ళు వచ్చింది. ఆమెకి యింక కూరగాయలు గుర్తు లేవు. డబ్బు గుర్తు లేదు. కూరగాయల మనిషికి ఇచ్చిన బుట్ట కూడా గుర్తు లేదు. రిక్షాలోంచి దిగిన ఆయన చూస్తాడేమోనని లోపలకు వెళ్ళి కూర్చుంది.

కూరగాయలవాడు పిలుస్తోంటే కామేశ్వర్రావు వెళ్ళి డబ్బు యిచ్చి, టొమేటో మాత్రం తెచ్చి యింట్లో పోశాడు. ఇల్లు గలాయన – ఆ అమ్మాయి తండ్రి రిక్షా దిగి లోపలికి వెడుతూ తన వంక చూశాడు. ఇది వరకు లాగ ముఖమంతా నవ్వు నింపుకోక, కొంచెం చిట్లించాడని చూసి, కామేశ్వర్రావుకి అవమానం అనిపించింది.

ఆ బాధలో అతనున్నాడు. తెల్లగా, నెత్తుటి చుక్కలేకుండా అయిపోయిన తల్లి ముఖంలోకి చూడలేదతను.

సుజాత వంట చేసి అబ్బాయికి వడ్డించింది. "సాయంత్రం తొందరగా వస్తావా?" అన్నదామె.

"లేదు. ఆలస్యమౌతుంది. ఇల్లు చూడడానికి వెడుతున్నాను. ఖాళీ చేస్తున్నానని ఆయనతో చెప్పి వస్తాను. ఆయన వచ్చిందీ అందుకే అయుంటుంది. ఖాళీ చేయిద్దామనే" అన్నాడు.

సుజాత అతని వంక చూసి, "నాయనా! నేనొకసారి ఆయనతో మాట్లాడుతాను" అన్నది.

"ఎందుకు? ఏమీ వద్దు" అన్నాడతను.

సుజాతకి మాటలు పెగలడం లేదు. "లేదు కామేశం! మా అమ్మ వచ్చిందని నా పేరు చెప్పు. అతనే వస్తాడు" అన్నది.

కామేశ్వర్రావు తలెత్తి చూశాడు ఆశ్చర్యంగా "ఎవరి మాట? ఏమీ వద్దు" అన్నాడతను.

"ప్రొద్దున్న రాలేదూ? అతనితోటే నేను మాట్లాడుతానేం?" అన్నదామె. కామేశం యిక ప్రశ్నలు వేయలేదు. ఏమిటి ఈవిడ మాట్లాడేది. ఆయన కాళ్ళు పట్టుకుంటుందా అని చీకాకు పడ్డాడు. కానీ బయటకు వచ్చినప్పుడు మాత్రం ఆయన కనుపించగానే, "నేను వేరే యిల్లు చూసుకుంటున్నానండీ మా అమ్మ వూరినుంచి వచ్చారు. ఎల్లుండి మార్చేస్తాము యిల్లు" అని చెప్పాడు.

"ఔను. చాలా ఏళ్లయింది" అన్నదామె మురళిని గుర్తు చేస్తున్న అతన్ని చూడగానే ఆమెకి దు:ఖం వచ్చింది. "మురళికి ఏమి సుస్తీ చేసింది?" అన్నాడతను. సుజాత చెప్పింది. పెద్దమామయ్య బాగున్నారా, అత్తయ్యబాగుందా అని అడగాలని, పిల్లలంతా ఎంతెంత వాళ్ళయ్యారో! చిన్ననాటి తన అత్తవారిల్లు. ఆ జ్ఞాపకాలన్నీ యితనితో కలిసి ముసురుకుంటూ వచ్చి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

"మీ అమ్మాయేనా ఆమె" అన్నది సుజాత.

"ఔను" అని అతను తలవంచుకున్నాడు.

సుజాత మనస్సులో పెద్ద ప్రశ్న పుట్టింది. ఆమె వూరుకోలేకపోయింది.

"శ్రీపతీ, నన్ను ఆ కూపంలోంచి బయట పడేసి పుణ్యం కట్టుకున్న వాడివి ఇప్పుడు నాకే నీ కూతుర్ని ఇవ్వడానికి వప్పుకోవడం లేదా?" అన్నది.

అతను తల ఎత్తలేదు. "ఇంట్లో ఎవ్వరూ ఒప్పుకోవడం లేదు. ఏం చేయమంటావు?" అన్నాడు.

"వప్పుకోకపోతే నువ్వు నచ్చచెప్పాలి. నీ వల్ల కాదూ నేను యింట్లోంచి బయటికి వచ్చింది. నీ వల్లనేగా నాకు యీ సంసారం, పిల్లలు వచ్చింది. నువ్వే మళ్ళీ నేనేదో తప్పు చేశానని వ్రేలెత్తి చూపిస్తావా!" అన్నదామె. ఏడుపు వస్తోంది. భరించరాని దు:ఖం వస్తోంది.

శ్రీపతి తల ఎత్తి చూశాడు. "నిన్ను శరణాలయంలో చేరి చదువుకోమని బయటికి తెచ్చానుగానీ, మురళితో లేచి పొమ్మనలేదే?" అన్నాడతను. లేచిపోవడం ఎంత మాట అన్నాడు? అర్ధరాత్రి వేళ నిద్ర లేపి, పరాయి మొగవాడితో వయస్సులో వున్న తనని వంటరిగా ఆ స్టేషనులో వదిలేసి వెళ్ళిన వాడు... తననే లేచి పోయావని అంటున్నాడు.

"నీకు తెలియదా అలా జరుగుతుందని" అన్నదామె.

"తెలియదు. తెలిస్తే రమ్మనే వాడిని కాదు" అన్నాడు నిశ్చయంగా.

"ఏమైతేనేం అయిపోయింది. అంతా అయిపోయాక యిప్పుడు నా బిడ్డని కించపఱుస్తావా శ్రీపతీ? వాళ్ళిద్దరూ ఎంతో యిష్టపడ్డారు. నువ్వెందుకు కాదంటావు?" అన్నదామె.

అతను ముఖం చిట్లించాడు. "మళ్ళీ అదే మాట అంటావు. నేను కాదు. మా యింట్లో ఎవరికీ యిష్టం లేదు" అన్నాడతను.

సుజాతకి ఏడుపు వచ్చింది. "ఔను. నువ్వే చెప్పి ఉంటావు. వీళ్ళమ్మ ఒకసారి కాదు. రెండుసార్లు విధవ అయింది. ఇంట్లోంచి లేచి పోయిందని. అందుకే ఎవరికీ యిష్టం లేదు" అన్నది ఏడుస్తూ. పట్టరాని ఉక్రోషంతో వూడిపోయిన జుట్టు ముడి వేసుకుంటూ వంటింట్లోకి వెళ్లింది. ఎందుకు వెళ్ళిందో తోచక తిరిగి మళ్లీ అతను కూర్చున్న చోటికి వచ్చింది. "మీ అమ్మాయికి కూడా మా వాడంటే యిష్టం పెరిగిపోయి వాడితో వెళ్ళిపోయి పెళ్ళి చేసుకుంటే ఏం చేసేవాడివి?" అన్నది నిలదీసి.

తడిసిపోయిన ఆమె ముఖంలోకి చూశాడు. కళ్ళు పౌరుషంతో మెరిశాయి. "అది నా కూతురు అల్లాంటి పని ఈ జన్మలో చేయదు..." అన్నాడు. గర్వం మాటలో వెడల్పుగా విరిచిన ఛాతిలో.

సుజాతకి కొరడాతో కొట్టినట్లుంది ఈ మాట. ఆపిల్ల శ్రీపతి కూతురు గనుక లేచి పోదు. తను సిగ్గుమాలినది కనక లేచిపోయింది. ఎంత మాట అన్నాడు శ్రీపతి.

"నీ కూతుర్ని ఇవ్వకపోతే మానె. కామేశాన్ని మాత్రం అవమానం చెయ్యకు. లేక యీ యింట్లోంచి ఎల్లాగూ వెళ్ళిపోతాంలే. పాపం పసిపిల్లలు, వాళ్ళ మనస్సులు ఎల్లా కొట్టుకుంటాయోనని పరుగెత్తుకుని వచ్చాను. నాకు తెలియదు శ్రీపతీ! నా కొడుక్కి పిల్లనివ్వనన్నదీ, నేను నీతిలేని దానిని అన్నవాడివీ నువ్వేనని

నాకు తెలియదు. లేకపోతే యిల్లా వచ్చేదాన్ని కాదు. నాకు తెలుసు నా బిడ్డ ఎంత బాధ పడిపోతున్నాడో. నీకేం తెలుస్తుంది" అన్నదామె. ప్రేమ అంటే ఏమిటి. ఒకరికోసం ఒకరు తపించి పోవడమంటే ఏమిటి నాకు తెలుసు. నేను దాన్ని చవి చూశాను. పరువుగా బ్రతకాలని గొడవ పడేవాడివి. నీకేం తెలుస్తుంది" ఈసడింపుగా అన్నది ఈ చివరి మాటలు ఆమె.

"ఆవేళ నువ్వూ, మురళి వెళ్లిపోయాక అందరూ నన్ను పట్టుకుని దులిపారు నీకు తెలియదు. వాళ్ళ అమ్మా, నాన్న విరుచుకుని పడ్డారు. వచ్చి అనరాని మాటలు అన్నారు. నన్ను చంపడానికి సిద్ధపడ్డారు. అంత గోలా యిప్పుడు ఔతుంది" అన్నాడతను.

"వద్దు శ్రీపతీ, నీకెందుకు ఆ గోల!" అన్నదామె. తల్లి, తండ్రి ఎప్పుడో తను చచ్చిపోయినట్లు లెఖ్ఖ వేసుకుని వూరుకున్నారు. కడుపున పుట్టిన బిడ్డలు మాట చెప్పుకోవడానికి కూడా లేకుండా తయారైనారు. తనని అర్థం చేసుకున్నాడనుకున్న శ్రీపతి ఇల్లా మాట్లాడుతున్నాడు.

తను ఎవరితో చెప్పుకుంటుంది తన విషయాలు ఇంక. ఇరవై ఎనిమిది సంవత్సరాలు తనతో కాపురం చేసి అది తనకి ఒక కలగా ప్రసాదించిన మనిషి వెళ్ళిపోయాడు. తనింక ఎవరితో చెప్పుకుంటుంది.

"శ్రీపతి. నువ్వొక్కడవే నన్నర్థం చేసుకున్నావనుకున్నాను. అది కూడా అబద్ధమై పోయింది.నేను చేసిన తప్పేమిటి? నేను మనిషినే అని బ్రతకాలనుకోవడం తప్పా? నీతిగా ఒక మనిషిని దైవంగా నమ్ముకొన్న జీవితం వెళ్ళబుచ్చాను. కంటికి రెప్పల్లాగ ఆయన్ని, పిల్లల్ని చూసుకున్నాను. నన్ను వెలివేసింది చాలదా? నా పిల్లలు బంగారు బాబులు. వాళ్ళని కాదనేందుకు కారణం మీ అందరికీ ఏమి కనబడింది? పోనీలే శ్రీపతీ! నువ్వే కాదు. నన్ను ఎవ్వరూ అర్థం చేసుకోరు. నేను దోషిని. ఆ దోషం వల్లే అందరికీ కష్టాలు. నా దోషం నేను ఏడిస్తే పోదు. నా గుండె బ్రద్దలు కొట్టుకుంటే పోదు. నాతోనూ పోదు. నీడలాగ! పెనుభూతంలాగ నావాళ్ళందరినీ ఆవహిస్తోంది. పోనీ నువ్వేం చేస్తావు. ఇల్లు ఖాళీ చేసి పోతాంలే" అన్నది. ఆమె ఏడుస్తోంటే ఏమనడానికీ తోచక శ్రీపతి తలవంచుకున్నాడు.

కొంత సేపటికి, "వస్తాను" అని లేచాడు. అత్తయ్యా అని తన నోటితో పిలవలేదు. బంధువులెవరి సంగతులూ చెప్పలేదు. నీ పెద్దకొడుకు ఏమి చేస్తున్నాడని అడగలేదు. ఇన్ని మంచినీళ్ళు కావాలని కూడా తీసుకోలేదు. ఇల్లు ఖాళీ చేస్తారన్న కబురు విని వెళ్ళిపోయినట్లు, లేచి వెళ్ళిపోయాడు.

సుజాత చాపమీద కూలబడింది. శ్రీపతి గుమ్మం బయటికి రాగానే అక్కడ నిలబడ్డ కామేశం కనబడిన సంగతి ఆమెకి తెలియదు. ఆమెకి దు:ఖం పోయింది. ఏడుపు కూడా రాక కూర్చుంది. కళ్ళు మూసుకుంది.

"అమ్మా!" అన్నాడు కామేశ్వరావు ప్రక్కనే కూర్చున్నాడు. ఆమెకు పట్టరాని బాధ వచ్చింది. సముద్రంలో అలలాగా ఏడుపు వచ్చింది. "నాయనా, నేను ఎటైనా వెళ్ళిపోతాను. మీకెవరికీ బాధ లేకుండా. ఎటైనా పోతానురా" అన్నది ఏడుస్తూ.

కామేశం గుటక మింగాడు. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "వద్దమ్మా ఎక్కడికెడతావు మేముండగా" అన్నాడు.

తనని కన్నవారు, పెంచినవారు, కట్టుకున్నవారు, రక్షించాననుకున్నవారు, ఈ సంఘం ఎవ్వరూ క్షమించలేదు. వాళ్లంతా క్షమించలేకపోయినా తనకింక పరవాలేదు. "నాయనా!" అన్న ఒక్కమాటే అనగలిగింది.

ఆఫీసుకు వెడదామని బయలుదేరి సగం నుంచి ఎందుకు తిరిగి వచ్చి, గుమ్మం దగ్గర నిశ్శబ్దంగా నిలుచుందీ కామేశ్వరావు చెప్పలేదు.